
# అప్పగింతలు

– పి. లక్ష్మి




సన్నాయి వాయిద్యాలతో, పట్టుచీరల రెపరెపలతో అత్తరుల గుబాళింపులతో పెళ్ళి వందిరంతా సందడిగా వుంది...

వచ్చేపోయే అతిథులు, చివరి నమయంలో వస్తున్న బంధువులు, పలకరింపులు, హాస్యాలు, చిన్నపిల్లల కేరింతలు పందిరంతా చాలా కోలాహలంగా ఉంది.

కొందరు వధూవరుల గురించి చర్చించుకుంటున్నారు. కొందరు 'బి.సి.' నాడు జరిగిపోయిన తమ పెళ్ళి ముచ్చట్లని నెమరు వేసుకుంటున్నారు. ఎవరి మాటల సందడి వారిది!

నేను మాత్రం వధూవరుల వెనకగా కూర్చున్నాను మౌనంగా—జరుగుతున్న తంతు అంతా పరిశీలనగా చూస్తూ... ముహూర్తం, మంగళ సూత్రధారణ, తలంబ్రాలు అన్ని ముచ్చట్లు, అన్ని వేడుకలు ఒకదాని వెంట ఒకటి సంభ్రమంగా జరిగిపోతున్నాయి... పెళ్ళి ముహూర్తం అర్ధరాత్రి ఒంటిగంట యిరవై నిమిషాలకి కావడంతో యీ వేడుకలన్నీ ముగిసే సరికి దగ్గర దగ్గర మూడయింది. అప్పటికే పెళ్ళి వందిరి చాలా వరకు ఖాళీ అయిపోయింది. ఎవరో దగ్గరవాళ్ళు బంధువులు తప్ప చాలామంది వెళ్ళిపోతున్నారు యిళ్ళకి. నేను మాత్రం కూర్చున్న చోటు నుండి కదలలేదు.

మధ్యలో పెళ్ళికొడుకు మా పిన్ని నడిగాడు... 'ఈ పాప యెవరు?' అని. మా పిన్ని సిగ్గుపడుతూనే 'మా అక్కయ్య కూతురు 'నిమ్మి' అంది. నా పేరు నిర్మల. 'నిమ్మి' నా ముద్దుపేరు.

ఉదయం నుంచీ పనిచెయ్యకపోయినా అటు-యిటు తిరగడంతో అలసిపోయానేమో కళ్ళు మూతలు పడిపోతున్నాయి. అతి ప్రయత్నం మీద కళ్ళు విప్పి చూడడానికి ప్రయత్నిస్తున్నాను. 'పాపా, నిద్ర వస్తోంది... వెళ్ళి పడుకోమ్మా...' పురోహితుడు మధ్యలో నన్ను హెచ్చరించాడు. కళ్ళు రెండూ గట్టిగా నులుముకుని కూర్చున్నానే తప్ప నేనక్కడి నుండి కదలలేదు.

'అప్పగింతలు! అంతా రావాలి!' పురోహితుడి కేకకు నిటారుగా కూర్చున్నాను. ఈ దృశ్యం కోసమే నేను కళ్ళు కాయలు కాచేలా యెదురు చూస్తున్నాను.

ఒక పళ్ళెం నిండా పాలుపోసి మా పిన్ని రెండు అరచేతులు అందులో ముంచి ఒక్కొక్కరికీ పేరు-పేరున అప్పగిస్తున్నారు. పిన్ని యేడుస్తోంది. అమ్మమ్మ కూడా సన్నగా యేడుస్తోంది. తాతయ్య ప్రక్కకి తిరిగి కళ్ళు తుడుచుకుంటున్నారు. అప్పగింతలు పూర్తి

> కొన్ని చిత్రమైన కోరికలు వ్యక్తులను జీవితాంతం వెంటాడుతూ వుంటాయి. ఆ కోరికలకు విశేష ప్రాధాన్యం లేకపోయినా, అవి జరగవలసిన సమయంలో జరగనప్పుడు కలిగే అశాంతి అనిర్వచనీయం. ముఖ్యంగా ఎవరితోనూ చెప్పుకోలేని అటువంటి కోరికల విషయంలో కలిగే బాధ – అది అనుభవించిన వారికే తెలుస్తుంది!

అయ్యాయి. మా అమ్మమ్మ తాతయ్య, మా పిన్ని మేనత్తలు అంతా ఒక్కొక్కరే వచ్చి పిన్నిని ఓదార్చి కంటతడిపెట్టుకుని వెళ్ళిపోతున్నారు. పాతికేళ్ళు పుట్టింట పెరిగిన ఆడపిల్ల యీ 'అప్పగింతలు'తో పూర్తిగా పరాయి యింటిదైపోతుంది... గోరు ముద్దలు తినిపించిన చేతులతోనే కన్నకూతురిని అత్తగారికి ఆడ పడుచులకి అందరికీ అప్పజెప్పడం! ఓహ్... ఎంత విచిత్రమైనదీ సృష్టి న్యాయం?

తెల్లవారగానే పిన్ని అత్తవారింటికి వెళ్ళి పోయింది. బంధువర్గమంతా కంటతడిపెట్టుకున్నారు. అప్రయత్నంగానే నా కళ్ళల్లోనూ నీళ్ళూరాయి.

అప్పటినుండి ఎవరి పెళ్ళి జరిగినా; ముహూర్తం మాట దేవుడెరుగు 'అప్పగింతలు' వేళకి నేను విధిగా హాజరయ్యేదానిని. కొన్నాళ్ళు నా యీ ప్రత్యేకమైన ఆసక్తిని గమనించిన అమ్మ అనేది... 'ఆడపుట్టుక పుట్టాక నీకూ అవన్నీ జరుగుతాయిలే.... ఎందుకంత సంబరం?' అని.



నిజంగా నాకు కూడా యిలాగే పెళ్ళి, అప్పగింతలు జరుగుతాయా? అప్పుడు వీళ్ళంతా... నా అన్నయ్యలు, వదినలు, అమ్మ, నాన్న అక్కయ్యలు అసలు కంటతడిపెట్టుకుంటారా? ఆ అనుభవం నాకెప్పుడు కలుగుతుందో? అని ఆలోచించేదాన్ని.

* * *

మా యింట్లో నేనే చివరిదాన్ని. నాకు ముందు నలుగురు అక్కయ్యలు, యిద్దరు అన్నయ్యలు... మూఢ నమ్మకాల వల్ల అమ్మ, నాన్నల సంసారం పెరిగిపోయింది మరి...

ఉన్నంతలోనే నలుగురు అక్కయ్యల పెళ్ళిళ్ళు అయ్యాయనిపించారు. అన్నయ్యలలో కూడా ఒకరిని ఎమ్.ఎస్.సి. ఒకరిని స్టెనోని చేసి పెళ్ళిళ్ళు చేసారు. ఇంక మిగిలినది నా పెళ్ళి. అక్కడికి వచ్చేసరికి పెద్ద కామా పడింది.

కాలం మారింది... మగపెళ్ళి వారి కోరికలూ పెరిగాయి. అమ్మ, నాన్నల ఆస్తి తరిగిపోయింది. అన్నయ్యలిద్దరూ ఎవరి సంసారాల్లో వాళ్ళు పడి యించుమించుగా నా పెళ్ళి సంగతి మర్చిపోయారు. ఇంటికి యెవరు వచ్చివెళ్ళినా ఆశగా యెదురు చూసేదానిని... నా పెళ్ళి ప్రసక్తి యే ఒక్కరైనా తీసుకు వస్తారేమోనని... కాని, యింటికి వచ్చే పోయే అక్కయ్యలు, పిల్లలు, పురుళ్ళు, బారసాలలు, అన్నయ్యలు, వదినలు, పిల్లలు... చాకిరీలు—వీటిలో పడి నేనే కాలక్రమాన నా పెళ్ళి సంగతి మర్చిపోతూ ఉంటే వాళ్ళకెలా గుర్తుంటుంది? పెళ్ళి జరగకపోయినా మా యిల్లు నిత్యకల్యాణం, పచ్చతోరణంలాగుండేది మరి!

ఎప్పుడైనా తీరిక దొరికినపుడు అమ్మ కంటతడిపెట్టుకునేది నాన్నగారి దగ్గర 'నిమ్మి గురించే బెంగగా ఉందండీ' అంటూ. 'పిల్లల్ని కనగలం గానీ వాళ్ళ రాతలని కనగలమా?' అనేవారు నాన్న మెట్ట వేదాంతధోరణిలో. అవును మరి... కొందరికి నేను నచ్చలేదు... కొందరికి నా వెనక కట్నం నచ్చలేదు... ఇందులో అమ్మా నాన్నల దోషమేముంది?

* * *

నా పెళ్ళి కుదిరింది.

మళ్ళీ యింట్లో పెళ్లి సందడి ప్రారంభమయింది.

కట్నం నలభై వేలు... అన్ని లాంఛనాలు కలిపి. 'పెళ్ళి' అనగానే ఆడపిల్లకి సహజంగా ఉండే కోరికల మాట యెలాగున్నా పెళ్ళిలో జరిగే 'అప్పగింతలు' నా దృష్టిలో ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. నాకు కూడా 'అప్పగింతలు' జరుగుతాయి. పేరు-పేరునా అందరూ వచ్చి నేను అత్తవారింటికి వెళ్ళినపుడు నన్ను చూసి కంటతడిపెట్టుకుంటారు... నేనూ వాళ్ళతోపాటు... అబ్బ! ఎంత థ్రిల్!

పెళ్ళి యింక రోజులలోకి వచ్చేసింది. అమ్మ హడావుడి అంతా యింతా కాదు. ఇల్లంతా చుట్టాలతో క్రిక్కిరిసి ఉంది. పెళ్ళి బట్టలవీ కొనడం అయిపోయింది. అమ్మ నన్ను పిలిచి—'నిమ్మీ నీకేమైనా కావాలంటే వెళ్ళి కొనుక్కురా.. మళ్ళీ యీ రోజు దాటితే నువ్వు బయటికి వెళ్ళకూడదు...' అంది. చటుక్కున నాకో ఆలోచన వచ్చి వెంటనే బజారుకి బయల్దేరి వెళ్ళాను మా అక్కయ్య కూతురిని తోడుగా తీసుకుని.

పావుగంటలో తిరిగి వచ్చిన నన్ను చూసి అందరూ ఆశ్చర్యంగా "ఏమిటి కొన్నావేమిటి—అంత త్వరగా వచ్చేసావ్?" అన్నారు. "నాలుగు రూపాయిలిచ్చి యీ కర్చీఫ్ కొన్నాను" అని చూపించాను. అందరూ ఫక్కున నవ్వారు. 'నీలాంటి వాడే కాశీ వెళ్ళి గాడిద గుడ్డు తీసుకు వచ్చాట్ట వెనకటికి' అంది అమ్మ నవ్వుతూ.

* * *

ముహూర్తం తెల్లవారు ఝామున నాలుగు గంటలకి. రెండు గంటలకే లేపి, స్నానం చేయించి గౌరీ తపస్సుకి కూర్చోబెట్టారు. నేను తెచ్చుకున్న కర్చీఫ్ మర్చిపోకుండా చీరలో దోపుకున్నాను.

ముహూర్తం, మంగళ సూత్రధారణ, తలంబ్రాలు, అన్నీ ఒకటొకటే చురుగ్గా సాగిపోతున్నాయి. నేను ఎదురు చూసిన సన్నివేశం రానే వచ్చింది. ఎన్నో సంవత్సరాలుగా నేను యెదురు చూస్తున్న క్షణాలివి! ఒక యిత్తడి పళ్ళెంలో పాలుపోసి నా రెండు అరచేతులని అందులో ముంచి ముందు మా అత్తమామలకు, తర్వాత ఆడబడుచులకు, బావగార్లకు అమ్మ, నాన్న నన్ను అప్పగిస్తున్నారు. నన్ను కని, పెంచి, పెద్ద చేసిన అమ్మ, నాన్నలు యింక నాకు పరాయి వాళ్ళనే భావం వచ్చేసరికే నా కళ్ళు చెమ్మగిల్లాయి. ఓర కంటితో అమ్మ వైపు చూశాను. ఏ భావం లేకుండా యాంత్రికంగా క్రియ జరుపుతోంది... నాన్న వెళ్ళిపోతున్న స్నేహితులను పలకరిస్తూ పరధ్యానంగా పనిచేసుకుపోతున్నారు. నా మనసు చివుక్కుమంది. మా అత్తయ్యలు, మావయ్యలు, అక్కయ్యలు, అన్నయ్యలు యే ఒక్కరూ లేచి రాలేదు... రాత్రంతా నిద్రలేమి వల్ల బడలికగా ఉందేమోనని సరిపెట్టుకున్నాను.

తెల్లవారితే 8 గంటల బస్సులో ప్రయాణం—బీరువాలోని నా చీరలలో నాకు నచ్చినవి కొన్ని తీసుకుని పెట్టె సర్దుకున్నాను. అంతా సిద్ధమయ్యాక అందరికీ చెప్పి రావాలని బయల్దేరాను. ఒక గదిలో అందరూ కూడి యేవో కబుర్లు చెప్పుకుంటూ కాఫీలు, టిఫిన్లు సేవిస్తున్నారు... గది బయటే నిలబడిపోయాను.

"వదినా, యీ జన్మలో దానికి పెళ్లి అయి అత్తవారింటికి వెళ్తుందా? అని బెంగపెట్టుకున్నాననుకో!" అమ్మ అత్తయ్యతో అంటోంది....

"ఆఁ ఆఁ! మా నలుగురి పెళ్ళిళ్ళ కట్నం ఒక్కర్తికే యిస్తే కట్నం కోసమైనా యెవడైనా చేసుకుంటాడు... చేసుకోడూ మరి?" పెద్ద అక్కయ్య కసిగా అంది.

అప్పుడే పెరట్లో నుండి వచ్చిన నాన్న కలుగ చేసుకుంటూ 'చేస్తే చేశాను అప్పు... కానీ గుండెల మీది నుంచి పెద్ద బరువు దించినట్లుగా ఉందనుకో..." అంటున్నారు బంధువులతో...

లోపలకి అడుగు వెయ్యాలన్పించలేదు...

నాకు దుఃఖం ముంచుకొచ్చింది. పరుగున నా గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుని వెక్కి వెక్కి యేడ్చాను... ఇంతమంది ఆప్తులలో యే ఒక్కరికీ నేను అత్తవారింటికి వెళ్ళిపోతున్నానంటే చీమకుట్టినట్లయినా లేదేం? ఏ ఒక్కరూ కంటతడిపెట్టుకోరేం? కన్న తల్లిదండ్రులకే అంత బరువైపోయిందా ఆడబ్రతుకు?

టాక్సీ వచ్చిన చప్పుడు విని చప్పున లేచి అద్దంలో ముఖం చూసుకుని సరిచేసుకున్నాను. కళ్ళు బాగా యెర్రబడ్డాయి... జుత్తు అంతా రేగిపోయింది.

"వెర్రిదానా! ఎప్పుడో పదిహేను, యిరవై యేళ్ళ క్రిందటి సంఘటనలు తలచుకుని కంటతడిపెట్టుకుంటున్నావా? ఒక్కసారిగా గుర్తు తెచ్చుకో... అప్పుడు నీ పిన్ని అక్కయ్యల వయసులు ఎంతెంతో? నిండా పాతిక నిండని వయసులు! మరి యిప్పుడు నీది! ముప్పై అయిదు! జీవితంలో సగభాగం యించుమించుగా పుట్టింట్లోనే గడిపి వెళ్లిపోతున్న నీ గురించి యెవరికి చింత? కాలంతో పాటు కొన్ని ఆచారాలు, విలువలు కూడా మారుతుంటాయి... ఆ పిచ్చి యేడుపు మాని త్వరగా సిద్ధం కా" పక పక నవ్వుతూ యెదురుగా అద్దంలో నా ప్రతిరూపం!

అవును కదూ! నా వయసు సంగతే మర్చిపోయాను... 'నిమ్మీ .... నిమ్మీ...' నలుగురైదుగురు నా గదివైపు పరిగెత్తుకు వచ్చారు... తలుపు తీసిన నన్ను చూసి హేళనగా నవ్వారు... అందులో అమ్మకూడా వుంది... "ఇదేమిటే పిచ్చిదానా! ఎప్పటికైనా ఆ శుభఘడియ వస్తుందా అని మేము యెదురు చూస్తూ ఉంటే నువ్వు అత్తవారింటికి వెళ్ళడానికి యేడుస్తున్నావు?" అంది.

నాకు ఏడుపు ఆగలేదు... అమ్మ భుజం మీద వాలిపోయాను వెక్కుతూ... నేను ఏడుస్తున్నది పెళ్లి అయినా తీరని నా కోరిక గురించి అని ఎలా చెప్పను?

'అప్పగింతలు' కోసం నేను కొనుక్కుని బొడ్లో దోపుకున్న కర్చీఫ్ నన్ను వెక్కిరించింది హేళనగా.

□